క్లుప్తంగా

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమం జరుగుతుందని.. ప్రజల ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

వ్యక్తిత్వ వికాస శిక్షకుడిగా నాగరాజ



సర్టిఫికెట్ అందుకుంటున్న నాగరాజ

ఐరాల: మండలంలోని చెంగనపల్లెకు చెందిన ఏఆర్ నాగరాజ వ్యక్తిత్వ వికాస శిక్షకుడిగా అధికారిక గుర్తింపు సంపాదించారు. చిత్తూరు ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంటెక్ పూర్తి చేసి, ప్రస్తుతం బెంగళూరులో ఓ సొంత ప్రైవేట్ కంపెనీ అధినేతగా ఉన్నారు. ఇటీవల ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేసి ఆ సంస్థ అధినేత గంప నాగేశ్వరరావు చేతుల మీదుగా వ్యక్తిత్వ వికాస శిక్షకుడిగా ధ్రువపత్రం అందుకున్నారు. తాను ఉచితంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు.

బాసటగా నిలిచిన స్నేహితులు



ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

సదుం: మండల కేంద్రంలోని బలిజవీధికి చెందిన మునిరాజా గత కొన్నిరోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. స్నేహితుడి అస్వస్థత సమాచారం తెలుసుకున్న 1993–94 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు స్పందించారు. అతనికి ఆదివారం రూ.44,500 నగదు, నిత్యావసర వస్తువులను అందజేశారు. హేమలత, నాగేశ్వారెడ్డి, అబీద్, సిలార్ పాల్గొన్నారు.

అడ్డుగా ఉన్న చెట్లు తొలగించాం

చౌడేపల్లి: మండలంలోని చిట్రెడ్డిపల్లె సమీపంలోని సబ్‌స్టేషన్ ఆవరణలోగల చెట్లను లేన్లకు అడ్డుగా ఉన్న వాటిని తొలగించామని ట్రాన్స్‌కో ఏఈ శశిధర్ ఆదివారం తెలిపారు. ఈనెల 5న సాక్షిలో సబ్‌స్టేషన్‌లో చెట్లు మాయం అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అడ్డుగా ఉన్న చెట్లను మాత్రమే తొలగించామని పేర్కొన్నారు.

47 మందికి కంటి పరీక్షలు



ఆపరేషన్లకు ఎంపికైన వారితో వైద్యులు

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం మహతీ ఫౌండేషన్ వారి సహకారంతో కుప్పం పీఈఎస్ వైద్యులు నిర్వహించిన వైద్యశిబిరంలో 47 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఐదుగురిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కుప్పం పీఈఎస్ వైద్యాధికారులు, మహతీ ఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆలయ పనుల పరిశీలన



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: మండలంలోని నెర్నిపల్లి వద్ద నూతనంగా నిర్మిస్తున్న చౌడేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణ పనులను ఆదివారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఎన్నో ఏళ్లుగా భక్తుల కలగా మిగిలిన చౌడేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం కావడం హర్షించదగ్గ విషయంగా కొనియాడారు. నాణ్యతతో కూడిన పనులు చేయాలని కోరారు. శాంతిపురం జెడ్పీటీసీ శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ చిన్నన్న, మిట్టూరు ప్రకాష్, హరి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

రొంపిచెర్ల: ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వవిద్యార్థులు 23 ఏళ్ల తర్వాత రొంపిచెర్ల నాగిరెడ్డి కల్యాణ మండపంలో ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. 1991వ సంవత్సరంలో 10వ తరగతి చదువుకుని కష్టాల్లో ఉన్న సహచర విద్యార్థులకు తమ వంతు సాయం చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.

అన్నీ ఖాళీ

రెండు లక్షలకు పైగా జనాభా, 50 డివిజన్లు. 14 విలీన పంచాయతీలు, రోజుకు వందలాది మంది సందర్శకులు ఇదీ చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రాధాన్యం. కానీ ఇక్కడ పనిచేసే సిబ్బంది సంఖ్య రెండంకెలు దాటలేదు. నగరవాసులకు మౌలిక సదుపాయాల కల్పన, కనీస అవసరాలను తీర్చడానికి కార్పొరేషన్ కార్యాలయంలో ఆశించిన స్థాయిలో అధికారులు, సిబ్బంది లేరు. ఉన్నవాళ్లల్లో 60 శాతం మంది వచ్చామా, వెళ్లామా అన్నట్లు ఉంటే.. మిగిలిన వాళ్లపై పడుతున్న పనిభారాన్ని తట్టుకోలేకున్నారు. అసలు కార్పొరేషన్‌కు మంజూరు కావాల్సిన పోస్టులను ఇవ్వడానికి ఆర్థిక శాఖ అనుమతులు ఇవ్వకపోవడంతో సుదీర్ఘ కాలంగా ఇక్కడి ఉద్యోగులకు తిప్పలు తప్పడంలేదు. – చిత్తూరు అర్బన్

- అరకొర పోస్టులతో.. అధికారులపై పని భారం
- పేరుకు కార్పొరేషన్.. ఆ స్థాయి పోస్టులెక్కడ?
- 12 ఏళ్లుగా అనుమతుల కోసం ఎదురుచూపులు
- చిత్తూరు కార్పొరేషన్‌ను పట్టించుకుంటే ఒట్టు

చిత్తూరు మున్సిపాలిటీ సెలక్షన్ గ్రేడ్ నుంచి కార్పొరేషన్‌గా 2012లో అవతరించింది. అప్పటికే ఉన్న 38 వార్డులకు అదనంగా చుట్టుపక్కల ఉన్న 14 గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ కార్పొరేషన్‌గా రూపాంతరం చేశారు. మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ కాగానే ఇక్కడ పలు పోస్టులు మంజూరు కావాల్సి ఉంది. వీటిలో అదనపు కమిషనర్ 1, కార్యదర్శి (కమిషనర్) 1, డివిజనల్ పీఆర్‌వో 1, డిప్యూటీ డీఈవో 1, సూపరింటెండెంట్ 7, సిస్టమ్ మేనేజరు 1, స్టెనోగ్రాఫర్ 1, అసిస్టెంట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ 1, డిప్యూటీ కమిషనర్ 1 పోస్టు ఉండాలి. వీటిల్లో ఒక్క పోస్టుకు కూడా ఆర్థిక శాఖ క్లియరెన్స్ ఇవ్వలేదు. అలాగే సీనియర్ అసిస్టెంట్ పోస్టులు 14 ఉండాలి. కానీ 6 మాత్రమే ఉండగా, 8 ఖాళీగా ఉన్నాయి. యూడీ ఆర్ఐ 3 ఉండాలి, 2 ఖాళీగా ఉన్నాయి. పబ్లిక్ హెల్త్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ 7 పోస్టులు ఉండాలి, మూడు ఖాళీగా ఉన్నాయి. శానిటరీ సూపర్‌వైజర్ పోస్టు కూడా ఖాళీగా ఉంది. ఈ లెక్కన 29 పోస్టులు కార్పొరేషన్ కార్యాలయంలో ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయాలంటే, ముందుగా ఆర్థికశాఖ అనుమతులు తప్పనిసరి.

అరకొర పోస్టులు

కార్పొరేషన్‌కు రావాల్సిన పోస్టులు రాకపోగా, ఇక్కడ అరకొర పోస్టులు ఉండడంతో పరిపాలనపై ప్రభావం చూపిస్తోంది. ప్రధానంగా కార్యాలయ పరిపాలనా వ్యవహారం, కౌన్సిల్ సమావేశాల నిర్వహణలో డిప్యూటీ కమిషనర్, అడిషనల్ కమిషనర్ పోస్టులు కీలకం. ఈ రెండు పోస్టులు ఖాళీగా ఉండడంతో భారం మొత్తం కమిషనర్‌పై పడుతోంది. ఇక కార్యాలయ పర్యవేక్షణ, విభాగాలపై పట్టు సాధించడానికి ఏడు సూపరింటెండెంట్ పోస్టులు ఉండగా ఒక్కటీ భర్తీ కాలేదు. ఆరు సీనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ పట్టించుకోకపోవడంతో ఉద్యోగులకు అంతర్గత పదోన్నతులు సకాలంలో లభించక, సర్వీసులో సీనియారిటీ కోల్పోతున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ.. సచివాలయ కార్యదర్శులు ఉండడంతో కాస్త నెట్టుకొస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, పాలకులు పోస్టుల భర్తీపై దృష్టి పెడితే కార్పొరేషన్‌లో పరిపాలన గాడిన పడే అవకాశాలుండడంతోపాటు దీర్ఘకాలికంగా ఉద్యోగులకు అడ్డుగా మారిన పదోన్నతులు లభించనున్నాయి.



చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

12 ఏళ్లుగా పోరాటం

పోస్టులైతే కార్పొరేషన్‌కు తగ్గ స్థాయిలో పేరుకు ఉన్నాయే తప్ప, రాష్ట్ర ఆర్థికశాఖ నుంచి అనుమతులు లభించడం లేదు. ఆర్థిక శాఖ నుంచి అనుమతులు ఇస్తేనే ఇతర ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులు సంబంధిత పోస్టుల్లో చిత్తూరుకు వచ్చి విధులు నిర్వర్తించే అవకాశం ఉంటుంది. మొదట రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ నుంచి ఫైలు సిద్ధం కావాలి. ఆపై ఆర్థికశాఖ ఆమోదిస్తే పోస్టులు మంజూరవుతాయి. కానీ 12 ఏళ్లుగా పోస్టుల మంజూరు కోసం ఉద్యోగులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఇక కార్యాలయంలో ఉన్న యూనియన్ నాయకులు ఇక్కడే రిటైర్‌మెంట్‌కు సిద్ధపడుతున్నారే తప్ప.. పోస్టుల మంజూరుపై పెద్దగా శ్రద్ధ చూపడం లేదు. యూనియన్ కోశాగారంలో నిధులున్నా, అవి ఏమవుతున్నాయి, ఎందరు ఉద్యోగుల సంక్షేమం కోసం ఖర్చు చేశారనే ప్రశ్నలకు సమాధానాలు లేవు. పోస్టుల మంజూరులో యూనియన్ నేతలు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలూ ఉన్నాయి.

మద్యం దుకాణాలకు మూడు రోజులే గడువు

చిత్తూరు అర్బన్: జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాల నిర్వహణ కోసం దరఖాస్తు చేసుకోవడానికి మూడు రోజులు మాత్రమే గడువు ఉంది. దీనిపై ఆదివారం చిత్తూరు జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ 104 మద్యం దుకాణాలకు ఇప్పటికే దరఖాస్తులు ఆహ్వానించామన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండింటిలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లాలో ఎక్కడి నుంచి ఏ దుకాణానికైనా అప్లికేషన్ పెట్టుకోవచ్చని, రూ.2 లక్షల నాన్ రిఫండబుల్ డీడీ తప్పనిసరన్నారు. ఏదైనా అనుమానాలు ఉంటే 040 42425520 నెంబరులో సంప్రదించాలన్నారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటలకు గడువు ముగుస్తుందని, 11వ తేదీన చిత్తూరులోని చక్కెర ఫ్యాక్టరీ కల్యాణ మండపంలో లాటరీ పద్ధతిలో దుకాణాల కేటాయిస్తారని తెలిపారు.

సమగ్ర శిక్ష సిబ్బందికి జీతాలు చెల్లించండి

బంగారుపాళెం: సమగ్ర శిక్ష సిబ్బందికి జీతాలు చెల్లించాలని జిల్లా సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ జేఏసీ అధ్యక్షుడు కృష్ణమూర్తి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. విద్యా శాఖకు సంబంధించి సమగ్ర శిక్ష విభాగం కింద పనిచేస్తున్న ఎంఐఎస్, డేటా ఎంట్రీ, సీఆర్ఎంటీ, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్, మెసెంజర్స్, ఐఆర్‌పీలు, డీపీఓ ఆఫీస్ సిబ్బంది, కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి గత రెండు నెలలుగా జీతాలు అందక అవస్థలు పడుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా జీతాలు చెల్లించాలని కోరారు.

జిల్లాలో చెస్ అభివృద్ధికి కృషి



ప్రసాద్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు, నగరవాసులు

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చెస్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఏపీ చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఆర్‌బీ ప్రసాద్ అన్నారు. ఆదివారం నగరంలోని విజ్ఞాన సుధ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ప్రసాద్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా అభినందన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతం కంటే ప్రస్తుతం చెస్ క్రీడకు ఆదరణ పెరిగిందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను చెస్ క్రీడ వైపు ప్రోత్సహించాలని చెప్పారు. ఏపీ చెస్ అసోసియేషన్ రాష్ట్ర పదవి రావడం రాయలసీమకే మొదటిసారి అని తెలిపారు. యువతకు చెస్‌పై మక్కువ కలిగించేలా విరివిగా క్యాంపులు నిర్వహిస్తామన్నారు. విజ్ఞానసుధ కళాశాల చైర్మన్ శ్రీధర్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే చెస్‌పై విద్యార్థుల్లో ఆసక్తిని పెంచాలన్నారు. ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, జ్ఞాపకశక్తి చదరంగం క్రీడతో పెరుగుతాయన్నారు. అనంతరం పలువురు ప్రముఖులు ప్రసాద్‌ను దుశ్శాలువాలు, గజమాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నగరవాసులు మండీ సుధ, కాజూరు బాలాజీ, ఆదినారాయణ, బాలు సోమనాథ్, కృష్ణకిశోర్, సునీల్, గిరి తదితరులు పాల్గొన్నారు.

వినాయకుని సేవలో అలహాబాద్ హైకోర్టు జడ్జి



స్వామి చిత్ర పటం అందుకుంటున్న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని ఆదివారం అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి మనోజ్‌కుమార్ గుప్తా దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి, దగ్గరుండి దర్శన ఏర్పాట్లు చేశారు. తర్వాత స్వామివారి ప్రసాదం, చిత్ర పటం అందజేశారు.

దరఖాస్తు చేసుకోండి

పలమనేరు: పలమనేరు ఎక్సైజ్ పరిధిలోని 13 ప్రైవేటు దుకాణాలకు ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చునని స్థానిక ఎక్సైజ్ సీఐ భాగ్యలక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మీసేవా కేంద్రాలు, నెట్ సెంటర్లలోనూ లేదా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

రాజా రామ్మోహన్ రాయ్ కీర్తి అవని శోభితం



రాయ్ పురస్కారాలు అందుకున్న సాహితీవేత్తలు, సంఘ సేవకులు, విద్యార్థులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): విశ్వ విఖ్యాత సంఘసంస్కర్త రాజా రామ్మోహన్ రాయ్ సంస్కరణోద్యమాల కీర్తి అవని శోభితమని ఎంవీ కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి కొనియాడారు. చిత్తూరు నగరంలోని రెడ్డిభవన్‌లో ఆదివారం భారతీయ తెలుగు రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో వ్యవస్థాపకుడు మత్రిపూడి దేవేంద్రరావు నేతృత్వంలో రాయ్ సంఘ సంస్కరణలపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఆనాటి భారతావనిలోని దురాచారాలను రూపుమాపేందుకు ఎనలేని కృషి చేసిన ఆధునిక భారత పితామహుడిగా రామ్మోహన్ రాయ్ వినుతికెక్కారన్నారు. విశ్రాంత సినీ పాత్రికేయుడు ఆర్.ఎస్.రాజన్, సాహితీవేత్త ఎస్.మునీంద్ర, సమాఖ్య ఉపాధ్యక్షుడు నందిపాటి చక్రపాణి, ప్రధాన కార్యదర్శి గొడుగుచింత గోవిందయ్య మాట్లాడుతూ నాలుగు వార్తాపత్రికలు ప్రారంభించి, ఆరు బిరుదులను రాయ్ పొందడం విశేషమన్నారు. అనంతరం 22 మందికి రాయ్ అంతర్జాతీయ పురస్కారాలను, కేఎం ఎర్రయ్య స్మారక పురస్కారం, నలుగురు విద్యార్థులకు ఉత్తమ విద్యార్థి పురస్కారాలను ప్రముఖ సాహితీవేత్త దేవేంద్రరావు ప్రదానం చేశారు. రచయితలు సోము ఉమాపతి, తోట గోవిందన్, పాలకూరు కన్నయ్య, ఎంజే భాస్కర్ రెడ్డి, సంఘసేవకులు కోటీశ్వర మొదలియార్, కె.ఆనందనాయుడు, ఎం.మొహిద్దీన్ అలీ, కె.హరిప్రసాద్ రెడ్డి, పీఆర్ జ్ఞానశేఖర్‌రెడ్డి, యతీష్, ఎం.దినకరన్, భూపతి, రోహిత్ కుమార్, వి.పవన్, ధనుంజయరెడ్డి, ఎం.నేతాజీ, విద్యార్థులు ఎస్.భావన, లిఖిత, టీఎస్ ప్రవల్లిక, మౌనిక పాల్గొన్నారు.

ముస్లింలు ఐక్యంగా ఉండాలి



ముస్లింల ర్యాలీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): అన్ని రంగాల్లో ముస్లిం సమాజం అభివృద్ధి చెందాలంటే ఐక్యంగా పోరాడాలని ముస్లిం ఐక్యవేదిక నాయకులు చిత్తూరు నగరంలో కదం తొక్కారు. ఆదివారం ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం నగరంలోని ఉర్దూ షాదీఖానాలో ముస్లిం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాఫర్‌వలి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముక్కలుగా ఉన్న ముస్లిం సమాజాన్ని ఒక్కటి చేస్తూ, రాజకీయ పార్టీలకు, జమాతులకు అతీతంగా ముస్లిం ఐక్యవేదిక పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధికార ప్రతి నిధి ఖలీల్ సయ్యద్, సెక్రటరీ సయ్యద్ నూర్, ఉపాధ్యక్షుడు రషీద్, జిల్లా కార్యదర్శి ఇనయతుల్లా, తిరుపతి జిల్లా అధ్యక్షుడు నిజాముద్దీన్ పాల్గొన్నారు.

జగన్ పర్యటనను జయప్రదం చేయండి

- మాజీ ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు: పట్టణంలో చిన్నారి అశ్వియ అంజుమ్(7) హత్యకు గురికావడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 9న పుంగనూరుకు వస్తున్నారని మాజీ ఎంపీ రెడ్డెప్ప తెలిపారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నాగభూషణం, పీకేఎం ఉడా మాజీ చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దిన్‌షరీఫ్‌తో కలిసి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. రెడ్డెప్ప మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఉదయం 10 గంటలకు పుంగనూరు సమీపంలోని బైపాస్‌రోడ్డు వద్ద గల హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డితో కలసి బాధిత కుటుంబం ఇంటి వద్దకు చేరుకుని వారిని పరామర్శిస్తారని తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, జగనన్న అభిమానులు అధిక సఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి చంద్రారెడ్డి యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు చెంగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ వేమన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ నాగేంద్ర, కౌన్సిలర్లు అమ్ము, కిజర్‌ఖాన్, జేపీ.యాదవ్, రేష్మ, సాజిదాబేగం, రాఘవ, నటరాజ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప















బంగారుపాళెం: ముత్యాలమ్మ, వజ్రాలపురం బోయకొండలో.. గుడిపాల: కాత్యాయినీ దేవి, పార్వతీదేవిదేవి, సౌభాగ్యలక్ష్మి, లలితా త్రిపురసుందరిదేవిగా పాలేటమ్మ, అన్నపూర్ణదేవిగా ఓం శక్తి అమ్మవారు

పార్వతీదేవి పాహిమాం

చిత్తూరు రూరల్: నగరంలోని పలు ఆలయాల్లో ఆదివారం కూడా నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగాయి. గిరింపేటలోని దుర్గాంబ దేవస్థానంలో ఉదయం అభిషేక పూజలు చేశారు. రాత్రి అమ్మవారిని మండపంలో పార్వతీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ చైర్మన్ దిలీప్‌రెడ్డి, ఈవో మునిశేఖర్‌లు భక్తులకు స్వామి ప్రసాదం అందజేసి ఉభయదారులను ఘనంగా సన్మానించారు. అలాగే అంకాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో విభూది అలంకారం, అన్నపూర్ణ అలంకారం, కోదండరామస్వామి ఆలయంలో వరహావతారం, సాయిబాబా ఆలయంలో లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులను కటాక్షించారు.

శ్రీలలితా త్రిపుర సుందరిగా ముత్యాలమ్మ

బంగారుపాళెం: దసరా ఉత్సవాలలో భాగంగా బంగారుపాళెంలోని గ్రామదేవత శ్రీముత్యాలమ్మ అమ్మవారు ఆదివారం శ్రీలలితా త్రిపురసుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహాలక్ష్మి, కల్పన, రాము ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమూర్తి, అర్చకులు మురళీగురుకుల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వజ్రాలపురం బోయకొండలో..

మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆదివారం శ్రీలలితా త్రిపురసుందరిదేవి అలంకారంలో భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూల విగ్రహాన్ని విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేపట్టారు. కరిడివారిపల్లెకు చెందిన లక్ష్మి, వేణుగోపాల్‌రెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప, ఆలయ మేనేజర్ మొగిలప్ప, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: కందగిరి కొండవద్ద ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం మూలస్థాన దుర్గమ్మ అమ్మవారు పార్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పల్లూరులోని గంగమ్మ అమ్మవారు కాత్యాయిని దేవిగా దర్శనమిచ్చారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: మండలంలోని కె.పట్నంలో సత్యమ్మ తల్లికి భక్తులకు విశేష పూజలు చేపట్టారు. శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అమ్మవారికి పసుపు, కుంకుమ, సుగంధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తిప్రపత్తులతో అభిషేకాలు, పూజలు నిర్వహించి దూపదీప నైవేద్యం సమర్పించారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులతో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పూజల అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

లలితా త్రిపురసుందరిగా పాలేటమ్మ

ఐరాల: శరన్నవరాత్రి వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్థానిక గ్రామదేవత పాలేటమ్మ లలితా త్రిపురసుందరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారి మూల విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఉత్సవ విగ్రహానికి వివిధ రకాల సుగంధ పుష్పాలతో నయనానందకరంగా అలంకరించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. పాతపాళ్యంలోని ఓం శక్తి అమ్మవారు అన్నపూర్ణదేవిగా, వైఎస్ గేటులోని చాముండేశ్వరి సౌభాగ్యలక్ష్మి అలంకారంలో భక్తులకు అనుగ్రహించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.





కె.పట్నంలో సత్యమ్మ తల్లికి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు, పార్వతీదేవిగా దుర్గాంబ

నిమజ్జనానికి తరలిన గణపయ్యలు



నిమజ్జన ఊరేగింపులో యువత సందడి

పలమనేరు: పట్టణంలోని జిలానీ క్రాస్‌లో వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన బొజ్జగణపయ్య విగ్రహాన్ని నిర్వాహకులు ఆదివారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, భారీ బాణసంచా, యువకుల కేరింతల నడుమ నిమజ్జనం సాగింది. దీంతో పట్టణంలోని అన్ని విగ్రహాలు నిమజ్జనానికి తరలాయి.

ప్రశాంతంగా టెట్ పరీక్ష



అభ్యర్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

పలమనేరు: పట్టణ సమీపంలోని మదర్‌థెరీసా ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం టెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని మూడు కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఆమేరకు స్థానిక సెంటర్‌లో పరీక్షకు ముందుగానే అక్కడి అధికారులు అభ్యర్థుల హాల్ టికెట్లను పరిశీలించి ఆపై హాలులోకి పంపారు. ఇక్కడి కళాశాల యాజమాన్యం ఇందుకు అవసరమైన ఏర్పాట్లను చేసింది.